RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి
మీకోసం

తెలుగు దినపత్రిక ఎడిటర్: మల్లె నాగిరెడ్డి



మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

-8లో



అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

-8లో

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :199 | ఆదివారం 05 ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in



## కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

**క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనం**
**మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు**

హైదరాబాద్: ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనమని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కేసీఆర్ కార్యాలయంపై దాడి చేయడం అంటే తెలంగాణ ప్రజల గౌరవంపై దాడి చేసినట్టేనని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత కార్యాలయంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు హద్దులు దాటుతున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను భయపెట్టేందుకు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిని గుర్తించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.



# బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

-2లో

- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి



-2లో

### కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం

తీవ్రంగా ఖండించిన హరీష్ రావు



-2లో

### తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు

బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు



## 210 పరుగులు చేసిన రాజస్థాన్

**అర్ధ సెంచరీలు చేసిన జైస్వాల్, జురెల్**

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ తో జరుగుతున్ పోరులో రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 210 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న రాజస్థాన్ కి అద్భుతమైన ఆరంభం లభించింది. ధ్రువ్ జురెల్ అద్భుతమైన అర్ధ శతకంతో చేయగా, ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (55) హాఫ్ సెంచరీతో చెలరేగగా, వైభవ్ సూర్యవంశీ మెరుపు బ్యాటింగ్ తో గుజరాత్ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించారు. అనంతరం జైస్వాల్ సూర్యవంశీ మధ్య నెలకొన్న 70 పరుగుల భాగస్వామ్యాన్ని గుజరాత్ కెప్టెన్ రషీద్ ఖాన్ బ్రేక్ చేశాడు. రషీద్ బౌలింగ్(6.2)లో ÷-లగెన్ ఫిలిప్స్ కి క్యాచ్ ఇచ్చిన వైభవ్ సూర్యవంశీ (18 బంతుల్లో 5 ఫోర్లు ఒక సిక్సుతో 31 పరుగులు) పెవిలియన్ కి వెళ్లిపోయాడు. అనంతరం జురెల్ తో కలిసి ఇన్నింగ్స్ ముందుకు నడిపిస్తున్న క్రమంలో జైస్వాల్ (36 బంతుల్లో 6 ఫోర్లు 3 సిక్సులతో 55 పరుగులు) తన అర్ధ శతకం పూర్తి చేసుకున్న తర్వాత కగిసో రబాడా బౌలింగ్ లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్ (8), షిమ్రాన్ హెట్‌మయర్ (18) పెద్దగా ఆకట్టుకోలేకపోయారు.

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు



-2లో

సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు

కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



-2లో

ఇరాన్‌కుమరోమారు ట్రంప్ హెచ్చరిక

## గడవు ముగుస్తోంది...

వాషింగ్టన్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి వార్నింగ్ ఇచ్చారు. తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఇరాన్ కు ఇచ్చిన పది రోజుల గడువు దగ్గరపడిందన్నారు. సమయం మించిపోతోందని, విధ్వంసానికి 48 గంటల సమయమే ఉందన్నారు. అంతా భగవంతుడి దయ! అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చివేసిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు

హైదరాబాద్: క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం పీఠాలు బీఆర్ఎస్ కైవసం కావడం హర్షణీయ మని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అధికార కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుం దన్నారు. అణచివేత, అప్రజా స్వామిక చర్యలకు రాష్ట్రంలో తావులేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందని ఈ ఫలితాలు చెప్పాయి. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.



## సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు

**బాస్‌ల పేరుతో హానికరమైన మెయిల్స్**
**అప్రమత్తంగా ఉండాలని సిపి సజ్జన్నార్ హెచ్చరిక**

హైదరాబాద్,: వ్యాపార సంస్థల అధినేతలు, సీఈఓలు, సీఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్ల లోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడిస్తూ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్



చేశారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని సీపీ తెలిపారు. సీఈఓ లేదా సీఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని వెల్లడించారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతు న్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు.

## పొంగులేటి మైనింగ్ స్కామ్ దృష్టి మళ్లింపు

**అందుకే తనపై సిఐడి విచారణ**
**హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



హైదరాబాద్: ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసు విధులకు భంగం కలిగించడం, రెచ్చగొట్టే వాఖ్యలు చేసిన కేసులో.. కౌశిక్ రెడ్డి శనివారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ అనంతరం ప్రభుత్వం, పోలీసులపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని రాజకీయంగా వేధించడానికి ఈ విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐడీ కార్యాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేను దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని అన్నారు.

## అమరావతికి ఆమోదించాక ఓర్వలేక మావిగన్ అంటూ వ్యాఖ్యలా

**ఇక జగన్ రాజకీయ జీవితం ముగిసినట్లే: భాను ప్రకాశ్**

తిరుపతి: వైసీపీని ఏపీ ప్రజలు ఛీదరించుకున్నారని.. ఓడిపోయిన తర్వాత రాష్ట్రంపై జగన్ ద్వేషం పెంచుకున్నారని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతి బిల్లుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమోదం తెలిపారని.. దాన్ని ఓర్వలేక జగన్ 'మావిగన్' అని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని అది అమరావతి అని తేల్చిచెప్పారు. మళ్లీ జగన్ అధికారంలోకి వచ్చేది లేదు.. చూసేది లేదన్నారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చేది ఒక కల మాత్రమే అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఒక కామెడీ యాక్టర్‌గా మిగిలిపోయారని.. ఆ వీడియోలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. మాజీ సీఎం అపరిచితుడిగా మారిపోయారంటూ వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఓ విధంగా.. ఓడిపోయిన తర్వాత మరో విధంగా ఉండే వ్యక్తి జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు గెలుపు ఓటములు సర్వసాధారణమన్నారు. బంగారు పంటలు పండే భూములను రైతులు.. రాష్ట్ర ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. అలాంటి రైతుల కళ్లల్లో కన్నీళ్లు పెట్టించి జైల్లో వేసి జగన్ రాక్షసానందం పొందారని విమర్శించారు. ఏపీని అభివృద్ధి ప్రదేశ్‌గా ఎన్డీఏ కూటమి ముందుకు తీసుకెళ్తోందని భాను ప్రకాశ్ వెల్లడించారు. ప్రజలు 2024లో ఓటు అనే గన్ ఆయుధంతో వైసీపీని పేల్చితే.. 164 సీట్లలో పిట్టలుగా లేచిపోయారని.. కేవలం 11 సీట్లు మాత్రం వచ్చాయని అన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు11 సీట్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రశాంత వాతావరణంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ చేష్టలను ఏపీ ప్రజలు ఛీదరించుకుంటున్నారని భానుప్రకాశ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో వెళుతోందన్నారు. 2019లో వైసీపీ ఏపీని అప్పుల ప్రదేశ్‌గా మార్చిందని భాను ప్రకాశ్ విరుచుకుపడ్డారు. జగన్, వైసీపీకి ఏపీ ప్రజలు విడాకులు ఇచ్చారన్నారు. అమరావతి రైతుల శాపం జగన్‌కు తగిలిందన్నారు. ఏపీలో వైసీపీ ఫ్యాన్ తిరగదని.. కామెడీలతో జగన్ శేష జీవితం పూర్తవుతుందని అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డికి చేతనైతే జగన్ చేతిలో భగవద్గీత పెట్టాలని సవాల్ విసిరారు. ఇంట్లో దేవాలయాల సెట్లు వేసుకుని.. కనీసం తీర్థం కూడా తీసుకోరంటూ జగన్‌పై భాను ప్రకాశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.?

## అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అమరావతి రాజధాని అంశంపై మరోసారి చర్చనీయాంశంగా మారేలా వైసీపీ నేత బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై
తీర్మానం చేసినంత మాత్రాన అది శాశ్వతం కాదని, అసలు నిర్మాణం పూర్తి కావడం ద్వారానే రాజధాని స్థిరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి మాకు ప్రయారిటీ కాదు. అది మాకు శాసన రాజధాని మాత్రమే. అలాంటప్పుడు మేమెందుకు రూ.లక్షా పదివేల కోట్లు ఖర్చు చేస్తాం? అమరావతి పనులు వేగంగా పూర్తి చేయాలి. సీఎం చంద్రబాబు అమరావతిని జాప్యం చేస్తే మేం ఇంకో ఆలోచన చేస్తాం అని బొత్స అన్నారు.రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, అమరావతి అంశం చుట్టూనే ప్రభుత్వం, మీడియా తిరుగుతోందని బొత్స విమర్శించారు. ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టి ఒకే అంశంపై దృష్టి సారించడం దురదృష్టకరమని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోయినా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు అమరావతిపై ఎంత ఖర్చు చేశారు, ఎంత ఫిజికల్‌గా పనులు జరిగాయి, ఎంత మొత్తాన్ని అడ్వాన్స్‌లుగా ఇచ్చారు అనే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణ వ్యయం మొదట లక్ష 16 వేల కోట్లుగా అంచనా వేయగా, ఇప్పుడు అది రెండు లక్షల కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. నిర్మాణ వ్యయాల్లో భారీ పెరుగుదలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన భవనాలను పూర్తి చేసి ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, పార్లమెంట్‌లో అమరావతిపై చూపిన శ్రద్ధను ప్రత్యేక హోదా సాధనపై ఎందుకు చూపలేదని ప్రశ్నించారు బొత్స. ప్రత్యేక హోదా వస్తే ముంబై స్థాయి నగరాలు, అనేక అభివృద్ధి కేంద్రాలు రాష్ట్రంలో ఏర్పడే అవకాశముందని అన్నారు. అమరావతిని ఆపేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేసిన బొత్స, ప్రభుత్వం ముందుగా నిర్మాణ పనులను పూర్తి చేసి తరువాతే ప్రకటనలు చేయాలని సూచించారు. కేవలం పేర్లు పెట్టడం లేదా ప్రకటనలు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యం కాదని విమర్శించారు. మొత్తంగా అమరావతి అంశంలో రాజకీయ విమర్శలు ముదురుతున్న నేపథ్యంలో, బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసే అవకాశముంది.

## బెడిసికొట్టిన మందుబాబుల ప్లాన్

**వాట్సాప్ గ్రూప్‌తో తనిఖీలపై ముందే హెచ్చరికలు**

**ట్రాఫిక్ ఎస్ఐ ఎంటర్‌తో దొరికిపోయిన మోసం**

పెద్దపల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మందుబాబులు వేసిన ఒక మాస్టర్ ఎ÷-లాన్ డైరెక్టుగా పోలీసులకే దొరికిపోయింది. పోలీసులు ఎక్కడెక్కడ చెకింగ్ చేస్తున్నారో ముందే సమాచారం తెలుసుకునేందుకు వారు ఏకంగా ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే, ఆ గ్రూప్‌లోకి నేరుగా ట్రాఫిక్ ఎస్ఐ ఎంట్రీ ఇవ్వడంతో మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. గోదావరిఖని ప్రాంతంలో కొంతమంది మందుబాబులు కలిసి 'పోలీస్ మామల స్క్వాడ్' పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను ప్రారంభించారు. కేవలం ఇద్దరితో మొదలైన ఈ గ్రూప్, చూస్తూనే వేల మంది సభ్యులకు చేరుకుంది. ఈ గ్రూప్ ప్రధాన ఉద్దేశ్యం ఏమిటంటే.. పట్టణంలో ఎక్కడైనా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుంటే, వెంటనే ఆ లొకేషన్ వివరాలను గ్రూప్‌లో షేర్ చేయడం. దీనివల్ల మందుబాబులు ఆ మార్గాల్లో వెళ్లకుండా ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుని పోలీసుల కళ్లు గప్పేవారు. ఇటీవల వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని సెల్ ఫోన్ తనిఖీ చేయగా ఈ వింత వాట్సాప్ గ్రూప్ వ్యవహారం బయటపడింది. ఆ గ్రూప్‌లోని మెసేజ్‌లను చూసిన స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ, వెంటనే అందులో ఒక సెల్ఫీ వీడియోను పోస్ట్ చేశారు. 'అరేయ్ మామ.. నేను ట్రాఫిక్ ఎస్ఐని రా మామ.. నా మీదే గ్రూప్ పెడతారా?' అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'నేను గోదావరిఖని మున్సిపల్ చౌరస్తాలో చెకింగ్ చేస్తున్నాను, దమ్ముంటే రండిరా మామ చూసుకుందాం' అని సవాల్ విసిరారు.ఆ వీడియోను చూసిన మందుబాబులు ఒక్కసారిగా హడలిపోయారు. వెంటనే గ్రూప్ నుండి లెఫ్ట్ అవ్వడం ప్రారంభించారు. అయితే ఎస్ఐ మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా.. 'ఎవరూ వెళ్ళిపోకండి, మీ అందరి నెంబర్లు సేవ్ చేసుకున్నాను, ఫోటోలు కూడా తీశాను. మీ అందరికీ త్వరలోనే ఒక స్పెషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ పెడతాను, అందరూ రండి' అని అదిరిపోయే కౌంటర్ ఇచ్చారు. మందుబాబుల 'స్మార్ట్ ప్లాన్' పోలీసుల చేతికి చిక్కడంతో ఇప్పుడు గోదావరిఖనిలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని మరీ మందుబాబుల ఆట కట్టించడంతో, ఇప్పుడు ఆ గ్రూప్‌లో ఉన్న సభ్యులంతా పోలీసులకు ఎక్కడ దొరికిపోతామో అని బిక్కుబిక్కుమంటున్నారు.

## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

**సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు**

**కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ**



తిరువనంతపురం: జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ది పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## పౌష్టికాహారంగా మధ్యాహ్న భోజనం

మచిలీపట్నం:మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు చాలా సంతృప్తిగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సన్న బియ్యంతో పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఆకుకూరలు, పప్పు కూరలు ఏ రోజు ఏమి వడ్డించాలో ఓ షెడ్యూల్ ప్రకారం భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు భోజనంతో పాటు ఒక గుడ్డు కూడా విద్యార్థుల ఆరోగ్యం కోసం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యం, రేషన్ బియ్యంతో భోజనం పెట్టి విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకున్నారని విమర్శించారు. పెనమలూరు ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులతో మాట్లాడి టీచర్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో లావు బియ్యంతో భోజనం వడ్డించేవారని, ప్రస్తుతం సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నారని మంత్రికి విద్యార్థులు చెప్పారు. ఆ తర్వాత విద్యార్థులకు మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన ఎజెండాగా భోజనాలు పెడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 2500 పాఠశాలలకు మోడల్ కిచెన్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ పథకానికి మాత్రమే 2162 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్యూర్‌ి÷డ్ మంచినీరు కూడా అందిస్తున్నామని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు కావాలని కుట్రలు చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించి విద్యార్థుల స్థితిగతులను తల్లిదండ్రులకు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో మెగా డీఎస్సీతో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేశామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. విద్యాశాఖపై మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గతంతో పోలిస్తే మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య 100 శాతం పెరిగిందని చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి విద్యార్థులతో భోజనం చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. నెలలో ఒక్కసారైనా ప్రజా ప్రతినిధులు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు.

## అమరావతి పేరుతో ప్రజలపై భారం

అమరావతి:అమరావతిపై ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు పదేపదే చెప్పిన అబద్దాలే చెబుతున్నారని విమర్శించారు. అమరావతి రాజధాని అంశంపై తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'వికేంద్రీకరణను మూడు ముక్కలాట అని ఎగతాళి చేశారు. ఇన్నాళ్లు అమరావతికి చట్టబద్ధత లేదా? ఇప్పటికే రాష్ట్రంపై చంద్రబాబు మోయలేని భారం మోపారు. అమరావతిని పూనకం వచ్చినట్లు రీస్టార్ట్ చేశారు. రాజధానిని పేకముక్కలతో పోల్చి వెటకారాలాడారు. ప్రజలపై భారంలేని గ్రోత్ ఇంజిన్ కావాలన్నది జగన్ ప్రతిపాదన. రాజధాని గురించి తొలుత ఆలోచన చేసినప్పుడు ప్రభుత్వ భూమి 30వేల ఎకరాలు ఉండాలన్నారు. సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చేవారికి అందుబాటులో ఉండాలన్నది అప్పుడు ఆయన ఆలోచన. దీనికోసం చేసే ప్రయత్నం ప్రభుత్వం మీద బరువు కాకూడదన్నది జగన్ ఆలోచన. దాన్ని దృష్టిలో పెట్టుకునే 30 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నచోట రాజధాని పెట్టమన్నారు. చంద్రబాబు 2019లో దిగిపోయే నాటికి రాజధాని ప్రాంతంలో దారుణమైన దోపిడీ, అవినీతి జరిగింది' అన్నారు. మా ప్రభుత్వంలో ఆ వ్యవహారాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఏ అవకాశం వచ్చినా దోపిడీ చేయడం అన్నది చంద్రబాబుకు అలవాటు. ఎన్ని విధాల పిండుకుని సంపాదించాలో చంద్రబాబుకు తెలుసు. అవసరంలేని, ఎక్కడాలేని రేట్లు పెట్టి, అందమైన పేర్లతో కాంట్రాక్టులు ఇచ్చి, దోపిడీ చేస్తున్నారు. మోటారు పెట్టి నీటిని తోడినట్టు, ప్రజల సొమ్మును రాజధాని పేరుమీద లాగేస్తున్నారు' అని అన్నారు. ఏపీలో చంద్రబాబు పట్టించుకోని సిటీలు ఎన్నో ఉన్నాయి. పార్లమెంట్ సాక్షిగా రేణుకా చౌదరి కమ్మరావతి అన్నారు. అమరావతిపై కుల
ముద్ర వేయబోయారు. రేణుకాచౌదరి వ్యాఖ్యలను టీడీపీ ఎంపీలు ఎందుకు ఖండించలేదు. రేణుకా చౌదరి అన్న మాటలకు నారా లోకేష్ చప్పట్లు కొట్టారు. రాజధాని నిర్మాణ ఖర్చు ప్రజల మీద పడకూడదన్నదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన. రాజధాని ప్రాంతంలో చంద్రబాబు సొంత ఇల్లు కట్టుకోలేదు. వైఎస్ జగన్ ఇల్లు, పార్టీ కేంద్ర కార్యాలయం ఇక్కడే కట్టుకున్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. చంద్రబాబు అండ్ కో దోపిడీ కోసమే అమరావతిని వాడుకుంటున్నాని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'మేము అమరావతిపై కులముద్ర వేయలేదు. రూ.2 లక్షల కోట్ల అప్పులతో సాధ్యంకాని అమరావతిపై... సంబరాలు చేయాలని ఇతర ప్రాంతాలకు చెప్పడం అన్యాయం. అమరావతి సంబరాల పిలుపును ప్రజలు తిరస్కరించారు. అధికారులకు, ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోలేదు.మట్టి, నీళ్లు ఇచ్చి నెత్తిమీద చేయిపెట్టారని ప్రధాని మోదీని చంద్రబాబే అన్నారు. అమరావతికి కులం రంగును పులిమింది చంద్రబాబే. అమరావతిలో అవినీతిని మేం ప్రశ్నిస్తున్నాం. నేలమీద నిలబడి ఆలోచించాలని జగన్ సలహా ఇచ్చారు. అది చేయకుండా ఎదురుదాడి చేస్తున్నారు. పార్లమెంటు అధికారాలు, చట్టాల తయారీ మీద చంద్రబాబువి అవగాహనలేని మాటలు. ఇన్నాళ్లు ముఖ్యమంత్రిగా ఆయన ఎలా పనిచేశారో కూడా అర్థం కావడంలేదు' అని చెప్పారు. అమరావతి బాండ్లను తన ఘనతగా చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'అప్పట్లో 8 శాతం వడ్డీకి రుణాలు వస్తుంటే, చంద్రబాబు 10.3 శాతం వడ్డీకి తెచ్చారు. దీన్ని కూడా ఘనంగా చెప్పుకోవడానికి సిగ్గుచేటు కాదా? అప్పు భరించేది, చెల్లించాల్సింది ప్రజలే. అమరావతి ప్రజలు కూడా ఈ అప్పులు భారాన్ని మోయాలి. అమరావతి ఇప్పట్లో కాదని చంద్రబాబే చెప్తున్నారు. 2043 అని చెప్తున్నారంటే దాని అర్థం అదే. అప్పటి వరకూ అమరావతి పేరుతో దోపిడీ చేయాలన్నది చంద్రబాబు ఎ÷-లాన్. తన అవినీతిని అందమైన కథల ద్వారా ప్రజలకు కన్వెన్స్ చేయాలనుకుంటున్నారు.తన దోపిడీ, అవినీతి కోసమే అమరావతిని చంద్రబాబుగా రాజధానిగా ఎంపిక చేసుకున్నారు. ఎన్ని కాంట్రాక్టులు అయితే, అంత డబ్బు సంపాదించవచ్చన్నది చంద్రబాబు ఆలోచన. చంద్రబాబు అబద్దాలకు ఆణిముత్యం. చంద్రబాబు చెప్తున్నదానికీ, జగన్ చెప్తున్నదానికీ మధ్య వ్యత్యాసాన్ని, నిజానిజాలపై ప్రజలు ఆలోచన చేయాలి. జగన్ చెప్పిన దాంట్లో వాస్తవికతను కనిపిస్తుంది. చంద్రబాబు ప్రణాళికతో అసలు రాజధాని వస్తుందా?' అని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇచ్చే నగరం, సజీవనగరంగా, అప్పుల భారం లేని విధంగా, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా అమరావతి ఎప్పుడు మారుతుంది? ఈ తరహా నగరం ఇప్పుడు కాదని చంద్రబాబే చెప్తున్నారు. ప్రభుత్వం చేసే అప్పుల ద్వారా రాజధాని కడితే ప్రభుత్వానికి ట్యాక్స్‌లు వస్తాయని అసంబద్ధమైన వాదనలు చేస్తున్నారు. అప్పుల ద్వారా నిర్మాణాలు, పైగా కంపెనీలకు జీఎస్టీ రాయితీలు. రూపాయి ఖర్చు చేసి, 10 పైసలు ఆదాయాన్ని, ఆదాయం అంటారా? అని అన్నారు. ఆ పది పైసలు కూడా కాంట్రాక్టర్లకు రాయితీలకు పోతుంది. అసలు చంద్రబాబు ఏ ఎకనామిక్స్ చదివాడో అర్థం కావడంలేదు. ఇంతచేసి చంద్రబాబు కట్టేది 7 బిల్డింగులు.

## బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే



హైదరాబాద్: బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## ఎఐ వైపు ఐటీరంగం పరుగు

అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వైపు ఐటీ రంగం వేగంగా మారుతోందని ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీనికి అనుగుణంగా మన మానవ వనరులకు తగిన శిక్షణ ఇవ్వడం చాలా అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. అమరావతి రీజియన్‌లో ఏఐ సమ్మిట్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. కృత్రిమ మేధపై అవగాహన పెంచేందుకు, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం, ఎస్‌టీపీఐ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ పట్ల స్పష్టత, టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవడంపై దిశానిర్దేశం చేశారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వస్తున్న మార్పులు, భవిష్యత్ తరాలకు అందించాల్సిన శిక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు అమరావతి, విజయవాడలో ఈ నాలుగో సదస్సును నిర్వహిస్తున్నాం. గతంలో విశాఖపట్నంలో
రెండు సార్లు, కాకినాడలో ఒకసారి ఈ కార్యక్రమాలు జరిగాయి. 25 ఏళ్ల కిందట సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్ల ఐటీ రంగంలో తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. హైదరాబాద్ ఒక మహానగరంగా అభివృద్ధి చెందింది. విశాఖపట్నంలో డేటా సెంటర్లు ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పటికే మూడు గిగావాట్ల డేటా సెంటర్స్ కోసం ఒప్పందాలు జరిగాయి. మరో 3 గిగావాట్లు పైప్‌లైన్‌లో ఉన్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్ ఇనిషియేటివ్‌ను అమరావతిలో ప్రారంభించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరోస్థాయికి తీసుకెళ్తుంది. ?రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా.. సుమారు రూ.6.5 లక్షల మందికి ఉపాధి లభించింది. ?ఉత్తరాంధ్రకి గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి సంస్థలు వచ్చాయి. రాయలసీమలోనూ ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ?కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెట్టడమే మా లక్ష్యం' అని చెప్పారు.

## కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

హైదరాబాద్: ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు.ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు ' హేట్ స్పీచ్ బిల్ ' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు.

## తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

వరంగల్: తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు
పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు.

# సాయుధ రైతాంగ పోరాట యోధురాలి సంతాప సభ

**గరిడేపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**




గరిడేపల్లి మండలం వెల్దండ గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు కామ్రేడ్ మేదరమెట్ల అనసూయమ్మ సంతాప సభ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగా రెడ్డి హాజరై మాట్లాడుతూ అనసూయమ్మ,భర్త కామ్రేడ్ సీతారామయ్యతో కలిసి నైజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ అనసూయమ్మ మల్లు స్వరాజ్యం తో అనేక ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొని సాయుధ పోరాటంలో సాయుధ పోరాట అనంతరం జరిగిన మద్యపాన నిషేధ ఉద్యమంలో మహిళల్ని ఏకం చేసి పోరాడిందని అన్నారు, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్లో సీతారామయ్య తో పాటు అనసూయమ్మ పాత్ర కమ్యూనిస్టు నిర్మాణంలో చాలా గొప్పదని అన్నారు క్లాసులు బోధించి పేద ప్రజల్ని చైతన్య పరిచేతను అన్నారు ఎంతమంది వచ్చినా లేదనుకుంటా భోజనం పెట్టే అమ్మ అనసూయమ్మని నీ ప్రాంతం వాలుగా భావిస్తారని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు నెంబర్ వెంకటేశ్వర్లు ములకలపల్లి రాములు జిల్లా కమిటీ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు నగర్ జిల్లా కమిటీ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు పల్లె వెంకట్ రెడ్డి ముత్యాలు మేకల్ నాగేశ్వరరావు చిన్నగాని సాంబయ్య సర్పంచ్ యానాల సోమయ్య ఉపసర్పంచ్, అంబటి బిక్షం బిక్షం బోయిలా అర్జున్ అనాల సుశీల దాసరి శ్రీను కోనాయ గుడి సర్పంచ్ సకినాల సైదమ్మ కోనైగూడెం సర్పంచ్ సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి యానాల బిక్షం కామల్ల కిరణ్ రాంబాబు కాశయ్య నాయకులు పేర్కొన్నారు.

# సాటి మనిషికి సహాయపడటమే మానవత్వం

## - ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**మదనపల్లె, ఏప్రిల్ 04,మన సాక్షి:**



సాటి మనిషికి సహాయం చేయడమే నిజమైన మానవత్వమని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ వై. పద్మప్రియ రెడ్డి అన్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీడీఎస్ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి బంగారు సుగుణ, ముక్తాపురం సుప్రజా రెడ్డి, డిష్ రెడ్డి కుమారి, మేకల సురేంద్ర, వైఎస్సార్‌సీపీ కురబలకోట యూత్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి, మదనపల్లె మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తట్టి శ్రీనివాసులు రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు సాంబశివరెడ్డి, మాజీ సర్పంచ్ శరత్ రెడ్డి, జడ్పిటిసి నల్లపురెడ్డి రమణారెడ్డి, సుధాకర్ రెడ్డి, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఇన్‌పేషెంట్ వార్డులు,ఓపీ విభాగంలో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం పద్మప్రియ రెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇతరులకు సహాయం చేయడంలో లభించే సంతృప్తి మరెక్కడా లభించదని పేర్కొన్నారు. ఆర్‌సీడీఎస్ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ పద్మప్రియ రెడ్డి సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు. తన పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని తెలిపారు.

# తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**పెన్ పహాడ్, ఏప్రిల్ 04,మన సాక్షి:**



మండల పరిధిలో గూడెపుకుంట తండాలో తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన సిసి రోడ్ల నిర్మాణాన పనులకు సర్పంచ్ గుగులోతు లచ్చిరాం నాయక్, ఉప సర్పంచ్ భూక్య నాగలక్ష్మి, వార్డు నెంబర్ జర్పుల రమేష్ ఇరువురు కలిసి సిసి రోడ్ల పనులను శనివారం ప్రారంభించినారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కుమారుడు గూడెపుకుంట గ్రామపంచాయతీ స్థలదాత అని రెడ్డి వెంకట్ రెడ్డి ని ఘనంగా సన్మానించి,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండా లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తండాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం మనీ, ప్రతి పేదవాడికి సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత బస్సు సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వారన్నారు. వార్డ్ మెంబర్ జెర్పుల రమేష్ నాయక్ , వార్డ్ లో పారిశుధ్య పనులు గ్రామ పాలక మండలి తో కలిసి వార్డులో ఎటువంటి సమస్యలు లేకుండా చేస్తున్నామని, అలాగే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్తు అధికారులతో మాట్లాడి తొలగిస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధూబ్లి, పంచాయతీ కార్యదర్శి బచ్చలకూరి సతీష్, వార్డు నెంబర్ భూక్య సురేష్, మాలోతు సాయి సఫిన్, భూక్య నాగు, గుగులోత్ బుజ్జి, గుగులోతు బాజీ గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం



**చింతపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**

వేసవి తాపానికి రహదారి వెంట వెళ్లే ప్రయాణికుల కోసం చలివేంద్రాలు ఎంతో సద్వినియోగం అవుతాయని ధైర్యపురి తండా సర్పంచ్ అనిత దాస్ పేర్కొన్నారు. శనివారం చింతపల్లి మండల పరిధిలోని హైదరాబాద్- నాగార్జున సాగర్ రహదారి వెంట వున్న ధైర్యపురి తండా ఎక్స్ రోడ్ పై స్థానిక సర్పంచ్ అనిత దాస్ ఆధ్వర్యంలో వేసవి దాహార్తిని తీర్చేందుకు ప్రయాణికుల కోసం కాల్ ఎనడకదారుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందర్,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు గురునాథం, మాజీ సర్పంచ్ దీక్ష నాయక్,మాజీ సర్పంచ్ యాచారం యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రాలతో నేరాలు అరికట్టవచ్చు

**పెన్ పహాడ్,ఏప్రిల్ 04,మన సాక్షి:**



నిఘా నేత్రాలతో నేరాలను అరికట్టవచ్చని సింగారెడ్డి పాలెం సర్పంచ్ ఓగ్గు కిరణ్ కుమార్ అన్నారు. శనివారం గ్రామంలోని ముఖ్యమైన బజార్లలో పోలీసు సిబ్బందితో కలిసి నిఘా నేత్రాలను ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ నిఘా నేత్రాలు ఏర్పాటు చేయడం వలన దొంగతనాలు, గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలోకి వచ్చిన, రోడ్డు ప్రమాదాలు జరిగిన అట్టి వాహనాన్ని గుర్తించవచ్చని, వేసవికాలంలో దొంగల బెడద ఎక్కువగా ఉంటాదని నివారణ కొరకు తోడ్పడుతుందని, యువత చెడు మార్గంలో నడవబోతున్నప్పుడు సీసీ కెమెరాలు రికార్డు అవుతుందని ఆయన తెలిపినారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువకులు పెన్ పహాడ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన రేషన్ షాప్ ప్రారంభం



**తుంగతుర్తి,ఏప్రిల్ 04, మన సాక్షి:**

తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండల పరిధిలోని వెలిశాల క్రాస్ రోడ్ వద్ద కొత్త రేషన్ షాపును గ్రామ సర్పంచ్ కుంభం మంజుల సతీష్ గౌడ్ నూతన రేషన్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్రామ సెక్రెటరీ దండిగా సుశీల శ్రీలత పులిమామిడి అశోక్ . శంకర్పల్లి వెంకటరెడ్డి కొడకండ్ల సోమిరెడ్డి ఎస్కే రజాక్టీవ్ గుప్పెడు సత్తయ్య గ్రామ ప్రజలు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్ బాధితునికి అప్పగింత

**బషీరాబాద్ , ఏప్రిల్ 04,మన సాక్షి:**




బషీరాబాద్ మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన సుదర్శన్ మొబైల్ పోగొట్టుక పోవడం జరిగింది ఇట్టి విషయం బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడంతో పోలీస్ సిబ్బంది సుదర్శన్ మొబైల్ సిఈఐ ఆర్ పోర్టల్ ద్వారా సర్చ్ చేసి వెతికి సుదర్శన్ ను ఆదివారం రోజు పిఎస్ కు పిలిపించి ఫోను వారికి తిరిగి అప్పగించడం జరిగింది. ఫోన్ అందుకున్న సుదర్శన్ పోలీస్ సిబ్బందికి ఎస్ఐ కానిస్టేబుల్ నర్సమ్మకు అభినందనలు తెలిపారు.

# ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**బషీరాబాద్,ఏప్రిల్ 04,మన సాక్షి:**




ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బషీరాబాద్ మండలంలోని కాశీంపుర్ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నరేష్ గౌడ్, రమేష్ రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అన్నారు

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద ఉద్రిక్తత

## స్థానికుల ధర్నా నేపథ్యంలో ముందస్తు అరెస్టులు

**దామరచర్ల,ఏప్రిల్ 04,మన సాక్షి:**



నల్లగొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టేందుకు సిద్ధమైన స్థానిక నిరుద్యోగులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసిన సంఘటన ఉద్రిక్తతకు దారి తీసింది. సమాచారం ప్రకారం, ప్లాంట్ పరిసర గ్రామాలకు చెందిన సుమారు 500 మంది యువకులు స్థానికులకు ఉద్యోగాలలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ భారీ స్థాయిలో ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకొని ప్రధాన నాయకులను మరియు కొంతమంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ఈ చర్యపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల కోసం ప్రశాంతంగా ధర్నా చేయాలనుకుంటే అడ్డుకోవడం సరైంది కాదని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు, ఎటువంటి అశాంతి నెలకొనకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా అరెస్టుల చేయడం సరైంది కాదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వీర్లపాలెం గ్రామ ప్రజలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీలో ఆరోగ్య పోషణ దినం..!

**గరిడేపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**



గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో అంగన్వాడి 5వ సెంటర్ లో ఆరోగ్య పోషణ దినం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటకం వేణు పాల్గొని మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలతో చదువుతోపాటు మంచి పోస్టిక ఏమైనా ఆహారాన్ని ఇచ్చి వారికి విద్యాబోధన చేయాలని చిన్నతనం నుండే మంచి అలవాట్లను మంచి భావాలను వారికి అలవాటు చేయాలని ప్రభుత్వము నుండి వచ్చే గుడ్లు పాలు వారికి సకాలంలో అందించాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడు నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు టెక్రోమేషన్ అందించినారు ( బాలామృతం ప్యాకెట్) అదేవిధంగా పిల్లలను ప్రతిరోజు తప్పకుండా అంగన్వాడి సెంటర్కు పంపించాలని కోరినారు ఈ సందర్భంగా,పిల్లలు గర్భిణీ స్త్రీలు బాలింతలు తల్లులు అంగన్వాడీ టీచర్ కటకం ఉమా హెల్పర్ భారతమ్మ,బాలింత తల్లులు సట్టు సౌజన్య,గానుగు శ్రావణి నేలపట్ల కవిత,దేవులపల్లి భవాని తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



**చింతపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**

చింతపల్లి మండలంలో ప్రజానాట్యమండలి మూడో మహాసభ కాచిపాక వెంకటయ్య అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య ఈ సభకు హాజరై మాట్లాడారు. అదేవిధంగా ఈనెల 6,7 తేదీల్లో ప్రజానాట్యమండలి జిల్లా 8వ మహాసభలు నల్లగొండ పట్టణంలో టీఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో జరగనున్నాయని జిల్లాలోని ప్రజా కళాకారులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో చింతపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలఅధ్యక్షులు గా వింజమూరి సైదమ్మ, కార్యదర్శి గా గాడుగు శివ, సహాయ కార్యదర్శి పిడిగండ్ల యాదమ్మ, ఉపాధ్యక్షురాలు నల్ల లలిత, కమిటీ సభ్యులు ఇంజమూరి ముత్తమ్మ,ఎల్లమ్మ, అనసూర్య, వెంకటమ్మ, మరో నలుగురితో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాలు ప్రజానాట్యమండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై దాడి దుర్మార్గం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 04, మన సాక్షి :**




సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై శనివారం జరిగిన దాడిని నారాయణ పేట జిల్లా బి.ఆర్.ఎస్.పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడైన కేసీఆర్ కార్యాలయంపై దాడి చేయడం అంటే తెలంగాణ ప్రజల గౌరవంపై దాడి చేసినట్టేనని ఎస్.రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు ఎప్పటికీ సహించరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత కార్యాలయంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అధికార అహంకారంతో కాంగ్రెస్ నాయకులు హద్దులు దాటుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి దాడికి పాల్పడిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారికి ప్రభుత్వం అండగా నిలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని వాపోయారు..

# మాజీ సర్పంచ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

**పెన్ పహాడ్,ఏప్రిల్ 04,మన సాక్షి:**



మండలం పరిధి లో దోసపహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతల శ్రీరాములు శనివారం మృతి చెందినారు వారి పార్ధీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగా రావు, పెన్ పహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మెడిమేలపు దామోదర్ రెడ్డి,మండల కాంగ్రెస్ నాయకులు కొండేటి బిక్షం రెడ్డి, నారాయణ ప్రవీణ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గద్దల నాగరాజు, సూర్యాపేట మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొనతం రాజేష్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సద్దల నాగేశ్వరరావు, విద్య సాగర్, శ్రీనివాస్ రెడ్డి, విజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్..!

## - రంగంలోకి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**




వైట్‌ఫీల్డ్ రామాలయం నుండి అంజయ్య నగర్ వరకు నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నడుం బిగించారు. శనివారం ఆయన టౌన్ ప్లానింగ్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ మరియు ట్రాఫిక్ విభాగం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.?పాదయాత్రగా పరిశీలన సమస్య తీవ్రతను గుర్తించేందుకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా పాదయాత్ర చేస్తూ రోడ్డు విస్తరణ అవకాశాలను పరిశీలించారు.?ఆక్రమణల తొలగింపు రోడ్డు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని, ఎటువంటి జాప్యం లేకుండా వాటిని తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. స్తంభాల తరలింపు రహదారి మధ్యలో అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే ఇతర ప్రాంతాలకు మార్చాలని సూచించారు.?శాశ్వత పరిష్కారం ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నా లక్ష్యం. ఏ చిన్న సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తా. శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను, అని స్పష్టం చేశారు.?కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజేష్, ఏసీపీ కరుణాకర్, స్థానిక నాయకులు చంద్రకాంత్ రావు, శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కొరకు దాతల విరాళాలు

**వెల్దండ,ఏప్రిల్ 04,మన సాక్షి:**



నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలంలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ చల్లపల్లి గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కొరకు దాతలు విరాళాలు అందజేశారు. చల్లపల్లి గ్రామానికి చెందిన పోలే అంజయ్య రూ. 5 వేలు, ఎర్ర జంగయ్య రూ. 3016, పకాడి అల్లాజి (టెక్నికల్ అసిస్టెంట్) రూ. 3016, పకాడి అంజయ్య రూ. 2516, దార్ల యాదయ్య రూ. 2016, పకాడి శానయ్య రూ. 2016, పోలె అర్జున్ రూ. 2016, పకాడి యాదయ్య రూ .2016 రూపాయలు విరాళం శనివారం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పకాడి బసవయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పకడి పరమేశ్వర్, పడాల వెంకటేష్, కొమ్ము రవి, పకాడీ జంగయ్య, పకాడీ శశి కుమార్, పకాడీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులను వెట్టి చాకిరీ నుండి విముక్తి చేయాలి

**నారాయణపేట టౌన్,ఏప్రిల్ 04, మన సాక్షి :**

నారాయణపేట్ జిల్లాలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ ఉద్యోగులను వివిధ కార్యక్రమాల పేరుతో వెట్టి చాకిరీ చేయించడం అన్యాయమని జిల్లా తెలంగాణ జాగృతి అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ఈ ఉద్యోగులను పిలిపించి, వారి విధులకు సంబంధం లేని పనులు చేయించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న బావోజీ జాతర లో కూడా వివిధ గ్రామ పంచాయతీల నుండి ఉద్యోగులను తీసుకువచ్చి వెట్టి చాకిరీ చేయించడం దురదృష్టకరమని పో పోయారు. మల్టీ పర్పస్ ఉద్యోగులు అమాయకులై, తమ హక్కుల గురించి మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారని, ఈ పరిస్థితిని అధికారులు దుర్వినియోగం చేయకూడదని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్, డీపీవో వెంటనే స్పందించి, గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ ఉద్యోగులను వెట్టి చాకిరీ నుండి విముక్తి చేసి, వారి విధులకు సంబంధం లేని పనులకు వినియోగించకూడదని కోరారు.

# మిర్యాలగూడలో కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ లోకి చేరికలు...!



**తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష**

**మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు**

**మిర్యాలగూడ,ఏప్రిల్ 04,మన సాక్షి:**

తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని కొత్త నందికొండ గ్రామానికి చెందిన 20 కాంగ్రెస్ కుటుంబాలు ఆ గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాటం మల్లికార్జున,మధు రాథోడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదే విధంగా చింతపల్లి గ్రామం మాజీ సర్పంచ్ బానావత్ లలితా సక్రు నాయక్ ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు బాణావత్ కృష్ణా నాయక్ తో పాటుగా 200 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గులాబీ తీర్థం పుచ్చుకున్న కార్యకర్తలను నల్లమోతు భాస్కర్ రావు కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్ తోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రతీ కార్యకర్త క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి గ్రామాల్లో చైతన్యం కల్పించాలని భాస్కర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్, మాజీ జెడ్పీటీసీ అంగోతు హాతిరాం నాయక్,అంజయ్య,ముత్యాలు, అమరావతి సైదులు, చౌగాని బిక్షం గౌడ్, కొర్ర చిన్న నాయక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఎకరాకు పెట్టుబడి సాయం అందించాలి

**పటాన్చెరు, ఏప్రిల్ 04,మన సాక్షి:**



రాష్ట్రంలోని రైతులకు అందాల్సిన రైతుబంధు నిధులను ప్రతి ఎకరాకు ఎటువంటి నిబంధనలు లేకుండా వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోనీ సిజిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాల వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో కేసీఆర్ హయాంలో ప్రతి రైతుకు సకాలంలో పెట్టుబడి సాయం అందించారని గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతుబంధు నిధుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో రైతులు సాగు ఖర్చుల కోసం అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద రెడ్డి, నాయకులు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మహేష్, జయపాల్ రెడ్డి, దర్గా శీను,రైతులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 04, మన సాక్షి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం శనివారం కొండారెడ్డి పల్లిలో పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవిఎన్ రెడ్డి ముఖ్యమంత్రి సోదరులు ఎనుముల కృష్ణారెడ్డి జగదీశ్వర్ రెడ్డి సర్పంచ్ వెంకటయ్యలతో కలిసి పెద్దమ్మ తల్లికి ఎంపీ మల్లు రవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. గ్రామ దేవతల శక్తి అంతా వైదిక పురాతన ఆరాధనలో ఉంటుందని అందులో భాగంగానే గ్రామ దేవతలను పూజించడం సంప్రదాయకంగా వస్తుందని మల్లు రవి తెలిపారు. పూజా కార్యక్రమాలలో ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు,ఉప సర్పంచ్ ఎనుముల వేమారెడ్డి, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్..!




**నల్లగొండ, ఏప్రిల్ 04, మన సాక్షి:**

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా.సముద్రాల ఉపేందర్ అన్నారు. స్థానిక నాగార్జున ప్రభుత్వ కళాశాలలో భారత మాజీ ఉపప్రధాని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఎన్ ఎస్ ఎస్ మరియు సోషల్ సైన్సెస్ విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్,అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత రాజకీయాల్లో బాబు జగ్జీవన్ రామ్ ఒక ధృవతార అని, ఆయన జీవితం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డా. డి. మునిస్వామి, రాజనీతి శాస్త్ర విభాగం అధ్యక్షులు డా. ఆదే మల్లేశం, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం అధ్యక్షులు ఎన్. కోటయ్య, అధ్యాపకులు డా. అనిల్ బొజ్జ, దినేష్,సావిత్రి, టి. శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడే మహా హరినామ సంకీర్తన

**జహీరాబాద్, ఏప్రిల్ 04, మన సాక్షి:**

జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 5 న మహా హరినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక హరేకృష్ణ మూమెంట్ బాధ్యులు విడుదల చేసిన ప్రకటన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ప్రతీ ఆదివారం ఉదయం నిర్వహిస్తున్న నగర సంకీర్తన 200 వారాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని శ్రీ మాణిక్ ప్రభు వీధి నుండి గౌర్ నితాయి, చైతన్య మహాప్రభు ప్రతిమలతో కూడిన పల్లకితో శోభాయాత్ర ప్రారంభం అవుతుంది. భక్తి గీతాలు, శ్రీల ప్రభు పాదుల ద్వారా రచించిన కీర్తనలు, మృదంగ వాద్యాలు, కర తాళ ధ్వనుల మధ్య ఆధ్యాత్మిక కీర్తనలు కొనసాగానున్నాయి. నాగులకట్ట, హనుమాన్ మందిరం, మెయిన్ రోడ్డు, అంబేద్కర్ విగ్రహం, రతన్ మెడికల్స్ మీదుగా పద్మశాలి భవన్ చేరుకుంటుంది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ గోల్డెన్ టెంపుల్ నుండి శ్రీ యగ్నేశ్వర్ దాస ప్రభుజీ, గోకులేష్ దాస ప్రభుజీ, సంగారెడ్డి జిల్లా కంది అక్షయపాత్ర బాధ్యులు విభీషణ్ దాస ప్రభుజీ లు అతిథులుగా విచ్చేసి పుష్పార్చన, ప్రవచనం, ఆరతి ఇత్యాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అనంతరం మహాప్రసాద వితరణ ఉంటుంది. భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి మహా హరినామ సంకీర్తన లో పాల్గొనాలని హరేకృష్ణ మూమెంట్ బాధ్యులు పిలుపునిచ్చారు. భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

# మొండి బకాయిలు వసూలు చేస్తే తప్పేనా..!

**వేములపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**



**తన పై కక్ష కట్టి అసత్య ఆరోపణలు**

**లక్ష్మీదేవిగూడెం వివోఏ ముత్యాల సరిత**

మొండి బకాయిలను వసూలు చేయడంతో కొంతమంది సభ్యురాలు కక్ష గట్టి తన పై తప్పుడు వార్తలను చిత్రీకరించి ఇబ్బందులు పెడుతున్నారని లక్ష్మీదేవిగూడెం వివోఏ ముత్యాల సరిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మొండి బకాయిలను వసూలు చేయడం తప్పు...కొంతమంది సభ్యురాలు నా వ్యక్తిగత పనులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొండిబకాయలను క్లియరెన్స్ చేస్తున్నాననే నేపథ్యంతోనే నా మీద ఇలాంటి ఆరోపణలు పూనుకున్నారని అన్నారు. లోన్లు కట్టని వారే నాపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఒక సంవత్సరం నుంచే శ్రీనిధి రికవరీ 18 శాతం నుండి 85 శాతానికి పెంచామని పేర్కొన్నారు. నాపై అవినీతికి పాల్పడినట్లు అభియోగం చేసిన నేను బాధపడను...నేను..సభ్యురాలకు అన్యాయం జరుగుతే ఆరోపణలు నిజమైతే స్వయంగా తప్పుకుంటానికి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘ బంధం అధ్యక్షురాలు చెన్నబోయిన లక్ష్మి, కార్యదర్శి ఇటమల్ల శిల్ప, ముత్యాల వెంకటమ్మ, లింగమ్మ, నవ్య, మౌనిక, సుజాత,రత్నబాయి తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో మిల్లర్ల సిండికేట్..!

మాజీ మార్కెట్ చైర్మన్ చింత రెడ్డి శ్రీనివాసరెడ్డి


**మిర్యాలగూడ, ఏప్రిల్ 04,మన సాక్షి:**



మిర్యాలగూడ నియోజకవర్గంలో రైస్ మిల్లర్లు సిండికేట్ గా ఏర్పడి రైతుల వద్ద తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలోని పలు రైస్ మిల్లులను మాజీ మార్కెట్ చైర్మన్, రైతుబంధు మాజీ జిల్లా అధ్యక్షుడు చింత రెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి ధాన్యం ప్రారంభమైన మొదటి రోజుల్లో క్వింటాలకు 2,750 ధరలు ఇచ్చిన వ్యాపారులు మూడు రోజులుగా సిండికేట్ గా ఏర్పడి 2400 మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద మొత్తంలో ధాన్యం ఇక్కడ మిల్లులకు వస్తున్నందున ప్రభుత్వం సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నియంత్రించాలని కోరారు. కె ఎన్ ఎం, మహేంద్ర చింటూ రకాలను కొందరు మిల్లర్లు మాత్రమే కొనుగోలు చేస్తూ క్వింటాలుకు 2100 మాత్రమే ధర చెల్లిస్తున్నారని, రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. గత ఏడాది యాసంగి బోనస్ ఇంతవరకు రైతులకు చెల్లించలేదని, ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి కేంద్రాల వెంటనే తెరిచి ధాన్యం కొనుగోలు ప్రారంభించి రైతులకు బోనస్ ఇవ్వాలని కోరారు. రైతులు వారం రోజులుగా ఆందోళన చెందుతున్నా.. ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులు మిల్లుల వద్దకు కనీసం వెళ్లకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే రెవిన్యూ పోలీస్ వ్యవసాయ శాఖ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చూడాలన్నారు .పెట్టుబడి వ్యయం బాగా పెరిగినందున కనీసం క్వింటాలకు రూ.3000 గిట్టుబాటు ధర అందించేలా చూడాలని కోరారు. ఆయన వెంట మండల బారాస అధ్యక్షుడు మట్టపల్లి సైదయ్య, సర్పంచులు ప్రసాద్, సాగర్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రైతులు మధుసూదన్, నాగేశ్వర రావు,వెంకన్న ఉన్నారు.

# గౌలిదోడిలో ఉచిత మెగా వైద్య శిబిరం

**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**



నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదోడి కేశవ్ నగర్‌లో శనివారం ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ వార్డు సభ్యుడు రాగం జంగయ్య యాదవ్ పితామహులు రాగం లక్ష్మీ నారాయణ యాదవ్ (వస్తాద్) 5వ వర్ధంతిని పురస్కరించుకుని, ఆర్ఎల్‌వై వస్తాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.? నల్లగండ్ల డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు రాగం హరి శంకర్ యాదవ్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమరిశెట్టి సాయిబాబా మరియు గచ్చిబౌలి సీఐ కె. బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.?శిబిరానికి వచ్చిన వందలాది మంది స్థానికులకు నిపుణులైన వైద్యులతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.?రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భీమ్ రాజు, రవి కుమార్, అరుణ్, మాధురి సంతోష్, దర్గుపల్లి పరమేష్, ఏ. లక్ష్మీ, ఎస్. లావణ్య, లక్ష్మణ్ రావు, నారాయణ, బాలకృష్ణ,వెంకట్ రెడ్డి, హనుమంతు, సురేష్, ఏ.వి. గోవింద్, శ్యామ్ కుమార్, దర్గుపల్లి కృష్ణ, సతీష్, నర్సింహ, వెంకటేష్, పి.రాజు, బి. బాలరాజ్, సాయి రామ్, ఎం.రమేష్, వి. మారుతి, ఎం. హనుమంతు, ఈశ్వర్, జె. యాదయ్య, జె. శ్రీను, జె. మల్లప్ప, రమేష్ పాల్గొన్నారు.

# చందానగర్ పోస్టాఫీసు నూతన కార్యాలయం ప్రారంభం



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 04,మన సాక్షి:**

స్థానిక ప్రజలకు మరింత చేరువయ్యేందుకు,మెరుగైన సేవలందించేందుకు చందానగర్ పోస్టాఫీసును నూతన ప్రాంగణానికి తరలించారు.శనివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త మిరియాల ప్రీతమ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, కొబ్బరికాయ కొట్టి కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు.?నూతన చిరునామా, సౌకర్యాలు ?ఇప్పటి వరకు పాత లొకేషన్‌లో కొనసాగిన పోస్టాఫీసు,ఇకపై ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా కింది చిరునామాలో సేవలందించనుంది. ప్రాంతం హుడా కాలనీ ,చందానగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రోడ్, సాయి దీప హాస్పిటల్ ఎదురుగా ?ఈ కార్యక్రమంలో పోస్టాఫీసు మేనేజర్ వెంకట్, ఇతర సిబ్బంది,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతన ప్రాంగణంలో సేవలు ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 25న కవిత నాయకత్వంలో కొత్త పార్టీ ఆవిర్భావం

**శంకర్‌పల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**



తెలంగాణ గడ్డపై మరో రాజకీయ ఉద్యమానికి నాంది పలుకుతూ, ఈనెల 25న ప్రకటించనున్న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాట్ల పై శంకర్‌పల్లి మండల కేంద్రంలో శనివారం భారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. కొలన్ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామిడి వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు కె.శివశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ ఆవిర్భావ ప్రకటన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ?తెలంగాణ ఆశయాల ప్రతిరూపం నూతన పార్టీ ?సమావేశం: కప్పాటి పాండురంగా రెడ్డి, రామిడి వెంకట్ రెడ్డి సంయుక్తంగా విలేఖరులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జి.ప్రశాంత్ గౌడ్, సయ్యద్ ఇల్యాస్, నరేష్ గౌడ్, అనుదీప్ రెడ్డి, శ్రీకాంత్, కిషోర్, భాస్కర్ రెడ్డి, మణిదీప్, మనీ, చింటూ, ఎత్తరి గణేష్, గౌతమ్ రెడ్డి, వంశీ, గిరి, శెట్టి రాజు, రాయగంటి జగన్ పాల్గొన్నారు.

# పోక్సో చట్టం పై విద్యార్థులకు అవగాహన

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 04, మన సాక్షి :**



రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు మేరకు శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గ్రౌండ్)లో విద్యార్థులకు ఫోక్సొ చట్టాలపై అవగాహన కల్పించారు. ఇట్టి సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాల బాలికల పై జరిగే లైంగిక వేధింపుల నిరోధ దానికి ఈ ఫోక్సో చట్టం ఎంతో కీలకమైందని అన్నారు. ఈ చట్టం 14 నవంబర్ 2012న అమలులోకి వచ్చిందని అన్నారు. ఈ చట్టమును అతిక్రమిస్తే కఠిన శిక్షలు వుంటాయని,18 ఏళ్ల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడానికి, బాధితులకు సత్వర న్యాయం అందించడానికి, పిల్లల భద్రతను కాపాడటానికి ఈ చట్టం రూపొందించబడిందని తెలిపారు . ఈ కార్యక్రమములో పారా లీగల్ వాలంటీర్ హాజమ్మ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్తు రావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం..!

**ఆమనగల్లు, ఏప్రిల్ 04, మన సాక్షి:**



ఆమనగల్లు మున్సిపాలిటీలోని 6వ వార్డు గుర్రం గుట్ట కలనిలో శనివారం పాతకోట సాయికుమార్ మనణేమ్మ ల నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి లతో మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్ మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెలగమల జగన్, పట్టణ అధ్యక్షులు మానయ్యా, కె ఎన్ ఆర్ సేవాదళం వ్యవస్థాపకులు మెకానిక్ బాబా, విజయ్, కృష్ణా నాయక్, కండే సాయి,గుంద్రాతి కుమార్ గౌడ్,నాజర్, పాతకోట రాజు, పూసల సత్యం,కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు

# ఆర్సీడీఎస్ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్‌గా పద్మప్రియ

- మదనపల్లి మహిళకు అరుదైన గౌరవం

**మదనపల్లి, ఏప్రిల్ 04,మన సాక్షి:**



ఆర్సీడీఎస్ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్‌గా మదనపల్లికి చెందిన వై. పద్మప్రియ నియమితులవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళా సాధికారత, సామాజిక సేవల పట్ల ఆమె చూపుతున్న కృషిని గుర్తించి సంస్థ రాష్ట్ర స్థాయి బాధ్యతలను ఆమెకు అప్పగించారు.పద్మప్రియ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పించడం, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడం, మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో ఆమె ముందుండి పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్‌గా ఆమె నియామకం సంస్థకు మరింత బలాన్ని చేకూర్చుతుందని అభిప్రాయపడుతున్నారు.పద్మప్రియ నియామకాన్ని పలువురు నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రెడ్డి సామాజిక వర్గం కోసం నిర్విరామంగా కృషి చేస్తానని తెలిపారు.. మహిళల సంక్షేమ అభివృద్ధి కోసం పాటుపడతానని తెలిపారు

# కారు ఆర్టీసీ బస్సు ఢీ..పలువురికి గాయాలు

**వెల్దండ,ఏప్రిల్ 04, మన సాక్షి:**



నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండల నారాయణపూర్ గేటు సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు కారు ఢీకొని పలువురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న కారు, అచ్చంపేట నుంచి హైదరాబాద్కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురితో పాటు ఆర్టీసీ బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ ని నియంత్రించారు. ప్రమాద ఘటన ను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఫీజుల కోసం వేధిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**గోదావరిఖని,ఏప్రిల్ 04,మన సాక్షి:**

ఈ నెల 8వ తేదీ నుండి వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల వసూలుకై హాల్ టికెట్లు ముద్రించి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని రామగుండం విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కి విద్యార్థి యువజన సంఘాల నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో ఈ నెల 8వ తేదీ నుండి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలన్నీ కూడా తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేయాలనే ఒకే ఒక లక్ష్యంతో నిబంధనలకు విరుద్ధంగా ప్రైమరీ నుండి 9వ తరగతి వరకు హాల్ టికెట్లు ముద్రించి సంవత్సరం ఫీజు మొత్తము
పూర్తిగా కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని హుకుం జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని పాఠశాల లు సీబీఎస్ఈ అనుమతులు లేకున్నా హంగులు ఆర్భాటాల ప్రచారాలు నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు బైరమల్ల దుర్గ ప్రసాద్, బూరుగు వంశీకృష్ణ, కొంటు సాగర్, పిడుగు సిద్ధార్థ లు ఉన్నారు.

# పురవీధుల్లో ఊరేగిన శ్రీకోదండ రాముడు..!



**రామసముద్రం,ఏప్రిల్ 04,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని కాప్పల్లె గ్రామ పంచాయతీ బైరాజుపల్లె శ్రీ కోదండ రామఉత్సవాలు భాగంగా గ్రామం లో శనివారం శ్రీ కోదండరామ స్వామి వారు పుష్పపల్లకి పై ఊరేగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామపెద్దలు గ్రామ ప్రజలు బెంగళూరు నుండి వివిధ రకాల పుష్పాలు తెప్పించి పల్లకిని ప్రత్యేకంగా అలంకరించి, పుష్పపల్లకిలో కొలువుదీర్చి పురవీధులలో డప్పువాయిద్యాలు భానసంచాలు, పిల్లనగ్రోవి నడుమ స్వామి వారు శ్రీ రామ నామస్మరణలతో ఊరేగింపు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామి వారికి మంగళహారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి కాక బెంగళూరు, చెన్నై నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.పుష్పపల్లకిని తిలకించడానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమలు నిర్వహించారు. ఈవేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పుష్పపల్లకి ఊరేగింపు వేడుకల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి పోలీస్ సిబ్బంది తో బందో బస్త నిర్వహించారు.

# జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు

**గోదావరిఖని, ఏప్రిల్ 04, మన సాక్షి:**




స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల లో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ 119 జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై ప్రసాద్ డాక్టర్ రవి, సుధా, అంబిక, రమ్య లు జగ్జీవన్ రావ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై ప్రసాద్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావు భారత స్వాతంత్రోద్యమంలో, దేశ ఉప ప్రధానిగా చేసిన సేవలను కొనియాడారు దేశంలోని ప్రజలకి సామాజిక న్యాయం సమానత్వం అణగారిన వర్గాల అభివృద్ధికై చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం స్వాతంత్ర ఉద్యమంలో బాబు జగ్జీవన్ రావు పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ చెరుకు రవి, డాక్టర్ సుధా, డాక్టర్ అంబిక, రమ్య శ్రీ జ్యోతి ఎంబీఏ ఎం కామ్ ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## నగర మేయర్ మహంకాళి స్వామి

**గోదావరిఖని,ఏప్రిల్ 04,మన సాక్షి:**



ఇంటిని శుభ్రంగా ఉంచుకున్న మాదిరిగా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ప్రజలను అభ్యర్థించారు. వార్డు సందర్శన లో భాగంగా శనివారం 11 వ డివిజన్ సంజయ్ నగర్ , జ్యోతి నగర్ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ కారెశీగుల రమ్య , నాయకులు దాసరి విజయ్ తదితరులతో కలసి ఆయన పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సహకరించి చెత్త బయట వేయకపోతే కాలువలన్నీ సాఫీగా ప్రవహించి పూడిక తొలగించడానికి డబ్బులు ఖర్చు చేయవలసిన అవసరం ఉండదని అన్నారు. కాలువల్లో పూడిక తొలగిస్తుంటే పాడై పోయిన కూలర్లు , పరుపులు వంటి భారీ వస్తువులు కూడా బయట పడడం విచారకరమని అన్నారు. కాలువ ప్రవాహానికి ఆటంకం కలిగించే ఈ తరహా వస్తువులు వేసిన వారికి జరిమానా విధించక తప్పదని అన్నారు. తమ ఇళ్లపైన ప్రమాదకరంగా తీగలు వేలాడుతున్నాయని పలువురు దృష్టికి తీసుకురాగా చర్య తీసుకోవాలని ట్రాన్స్ కొ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు వడ్లూరి రవి , దాసరి సాంబమూర్తి , చిదురాల నాగరాజు , డేవిడ్ రాజు నాయకులు గద్దం శ్రీనివాస్ , చుక్కల శ్రీనివాస్ , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , డి . ఇ .ఇ . అఫ్తాబ్ , ఎ . ఇ అన్వేష్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , శానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ జవాన్ అడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎస్.వి మోడల్ హై స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**మిర్యాలగూడ, ఏప్రిల్ 04,మన సాక్షి:**



మిర్యాలగూడ లోని వాసవి నగర్‌లోని ఎస్.వి మోడల్ హై స్కూల్ లో కల్చరల్, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాంసుందర్, డైరెక్టర్ విశాలక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా యుకెజి విద్యార్థులు తమ ప్రీ--ప్రైమరీ విద్యను విజయవంతంగా పూర్తిచేసుకొని ప్రైమరీ విద్యలోకి అడుగుపెడుతూ, అలాగే 5వ తరగతి విద్యార్థులు ప్రైమరీ విద్యను పూర్తిచేసుకొని హయ్యర్ ఎడ్యుకేషన్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని గ్రాడ్యుయేషన్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. విద్యార్థులు గ్రాడ్యుయేషన్ గౌన్స్, క్యాప్స్ ధరించి స్టేజ్‌పై సర్టిఫికెట్లు స్వీకరించే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు ప్రదర్శించిన అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను మంత్ర ముగ్ధులను చేసి, కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి సుమారు 500 మంది తల్లిదండ్రులు, విద్యార్థులు ఆహ్వానితులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు. అదేవిధంగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ – టెక్నో (ఐఐటి-- జె ఈఈ, నీట్ ఫౌండేషన్) కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా కంప్లీషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఓరుగంటి శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ మరియు విలువలను అలవర్చుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 30 లోపు ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందండి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 04,మన సాక్షి:**

2026-27 ఆర్థిక సంవత్సరంకు గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఏప్రిల్ అనగా 30 లోపు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సంబంధిత బిల్ కలెక్టర్, పురపాలక సంఘ కార్యాలయము లో, మీసేవ, పౌర సేవ కేంద్రాల్లో లేదా ఆన్లైన్ హెచ్ టి టి పి://సి డి ఎం ఏ. సి జి జి. జిఓ వి. ఇన్ ద్వారా పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. పన్ను చెల్లింపుదారులకు సంవత్సర మొత్తమునకు ఒకేసారి అనగా ఏప్రిల్ 30వ తేది లోపు చెల్లించినట్లైతే 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి అర్థ సంవత్సరమునకు – జూన్ 30 లోగ చెల్లించాలని,రెండవ అర్థ సంవత్సరమునకు – డిసెంబరు 31 లోగ ఆస్తిపన్ను చెల్లించినట్లు ఐతే ఎటువంటి వడ్డీ విధించబడదని,తెలంగాణ



పురపాలక సంఘాల చట్టము 2019 యొక్క సెక్షన్ – 100 ద్వార నిర్థిష్టపరచిన నిభంధనల మేరకు ఆలస్యమైన ప్రతి నెలకు 2 శాతంద వడ్డీ విధించబడునని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు పురపాలక సంఘ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్స్పెక్టర్/ రెవెన్యూ అధికారి/మునిసిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని కోరారు.

# డ్రైనేజీ శుభ్రం చేసిన సిబ్బంది

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 04 మన సాక్షి :**



నారాయణపేట మున్సి పాలిటీ లోని 8వవార్డులో ఎంతోకాలంగా శుభ్రం చేయకుండా ఉండిపోయిన మెయిన్ రోడ్డులోని మురికి కాలువను శనివారం మున్సి పల్ శానిటరీ సిబ్బంది శుభ్రం చేశారు. ఇందుకు గాను 8వ వార్డు కౌన్సిలర్ సత్యమ్మ, వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్ధన్ లక్ష్మణ్ మున్సి పల్ కమిషనర్ నర్సయ్య,శానిటరీ ఇన్ స్పెక్టర్ నరేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గొల్ల లక్ష్మణ్, కురువ మనోజ్, జరంగ్ రాము తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ విద్యార్థికి సన్మానం

**కొడంగల్ ఏప్రిల్ 04, మన సాక్షి:**



కొడంగల్ నియోజకవర్గ దౌల్తాబాద్ మండలం గోక ఫసల్వా వాద్ గ్రామంలో ఉన్నటువంటి ఆంగ్ల పాఠశాల ఫైనియర్ స్కూల్ లో తండకు చెందిన గిరిజన బిడ్డ సభావాత్ గౌతమ్ తల్లితండ్రులకు రవి జవాన్ న్ మన్ని బాయి దంపతులకు ఫైనియర్ పాఠశాల యాజమాన్యం సుధాకర్ రావు, వీరేశం, ప్రధానోపాధ్యాయులు, జయరాజ్ ,సెలవాతో పూలమాలతో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జయరాజ్ మాట్లాడుతూ, ఎక్కడో మారుమూల తండాలో పెరిగి నవోదయ విద్యాలయ 2026 ఫలితాలలో అద్భుత ప్రతిభ చాటారు. 90/100 మార్కులతో జిల్లా స్థాయిలో 33 వ. ర్యాంక్ సాధించి గ్రామానికి పాఠశాలకు గర్వ కారణంగా నిలిచారని ఆయన అన్నారు. గ్రామస్తులు,ఉపాధ్యాయులు, సభావాథ్ గౌతమ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం సుధాకర్ రావు, వీరేశం, ప్రధానోపాధ్యాయులు జయరాజ్, జగదీశ్వర్, శ్రీనివాస్, నర్సింలు, హైమద్, రాజ్ కుమార్ శ్వేత,స్వాతి, కవిత, మంజుల, సానియా,పాపి,మాధవి, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



# శ్రీకోదండరాముల వారి కళ్యాణోత్సవం

**రామసముద్రం,ఏప్రిల్ 04,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని బలిజ వీధిలో ప్రతి ఏటా శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శ్రీసీతా రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రతి సంవత్సరం కళ్యాణో త్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ, శనివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, కైంకర్యాలు బందిలి శివ కుటుంబసభ్యులు, బందేలఆదేమ్మ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. బలిజ వీధిలో కొలువైన శ్రీ కోదండరామ స్వాములవారి ఆలయంలో 9రోజులు పాటు ఉత్సవాలు బలిజ వీధి పెద్దలు,వీధిప్రజలు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని పాలాబత్తుని సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులచే కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా ఆ ఆలయం వద్ద పాలాభత్తుల సుబ్రహ్మణ్యం వారి కుమారులు రవిచంద్ర శ్రీనివాసులు,హోటల్ విజయ్ స్వామి, నారాయణ స్వామి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమంలో నయ్యండి డ్యాన్స్ లు, పిల్లనగ్రోవి, గెరిగే డ్యాన్స్ లు కోలాటాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈశ్రీరాములవారి ఉత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందో బస్త్ నిర్వహించారు.

# ట్రైనీ కలెక్టర్‌కు ఘన సత్కారం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 04, మన సాక్షి :**



నారాయణపేట జిల్లాకు శిక్షణ కోసం వచ్చి తిరిగి వెళ్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ కు శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, జిల్లా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికి పూల మాల, పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ శిక్షణాకాలంలో ప్రణయ్ కుమార్ చూపిన నిబద్ధత, చిత్తశుద్ధిని కలెక్టర్ కొనియాడారు. ముఖ్యంగా నర్వ యాస్పిరేషన్ బ్లాక్ లో ప్రణయ్ కుమార్ చేపట్టిన కార్యక్రమాలు, కొత్త కొత్త ఆలోచనలతో అధికారులకు చేసిన దిశా నిర్దేశాలు అభినందనీయం అన్నారు. బదిలీపై వెళ్ళిన కలెక్టర్ సిక్తా పట్నాయక్, ప్రస్తుత కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్డీఓ, ఇతర అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ స్టాఫ్, పేషి స్టాఫ్ అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీధర్, సూపరింటెండెంట్ జయసుధ, డీపీ అర్ వో రషీద్, ఈ.డి.ఎస్.సి. కార్పొరేషన్ అబ్దుల్ ఖలీల్,డిటీ అఖిల ప్రసన్న, నర్వ తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సెయింట్ జాన్స్ హైస్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**మిర్యాలగూడ, ఏప్రిల్ 04,మన సాక్షి:**



మిర్యాలగూడ చైతన్య నగర్ లోని సెయింట్ జాన్స్ హైస్కూల్ నందు గ్రాడ్యుయేషన్ డే, వార్షిక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే అనేది విజయాన్ని జరుపుకునే రోజు, భవిష్యత్తుకు కొత్త ఆరంభం, విద్యార్థులు పేర్లు రాయడం, చదవడం నేర్చుకుని, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకుంటూ కిండర్ గార్టెన్ పూర్తి చేసుకుని ప్రైమరీ విద్యకు. సంసిద్ధం అయినారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్య, వైజ్ఞానిక,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడం మా పాఠశాల ప్రత్యేకత అని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ అలుగు బెల్లి శిరీష తో కలిసి విద్యార్థులకు సర్టిఫికేట్స్ మెమెంటోలను అందజేసారు, వార్షిక దినోత్సవంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయు విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొని విజయ వంతం చేసారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రవి శంకర్ రెడ్డి, మల్లికార్జున్, కె. సుమన్,పరమేశ్వరి, పద్మ, ఇ. లావణ్య,సుజాత,శృతి, సుందరయ్య పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాలు వేయించిన వార్డు సభ్యులు

**వెల్దండ,ఏప్రిల్ 04,మన సాక్షి:**



వెల్దండ మండల కేంద్రంలో 12 వార్డులో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు విద్యుత్ అవసరాలు మెరుగుపరిచేందుకు 12వ వార్డు సభ్యులు సిరిసనగండ్ల శేఖర్ ఆధ్వర్యంలో శనివారం 10 స్తంభాలకు త్రీఫేస్ వైరు కనెక్షన్ ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా ఏడు విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో ఏ సమస్య ఎదురైనా వెంటనే పరిష్కరించి, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజాసేవ చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 04, మన సాక్షి:**



జిల్లా కేంద్రంలోని మైనారిటీ పాఠశాలను శనివారం మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ రషీద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వంటగదిని, మరుగుదొడ్లను పరిశీలించి పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంట గదిలో ఉన్న సరుకులను పరిశీలించారు. అలాగే పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వీర వనిత జల్కరి బాయ్ వర్ధంతి



**మందమర్రి,ఏప్రిల్ 04,మన సాక్షి:**

చరిత్ర మరిచిన మహిళ సైనికురాలు జల్కరి భాయ్ వర్ధంతిని రిటైర్డ్ మిలటరీ జవాన్ సింగరేణి ఎస్ ఎన్ పి సి ఉద్యోగి రాజేష్ పన్నాల్ దంపతులు మందమర్రిలోని వారి నివాసంలో జలకరి భాయ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు ఓ రవీందర్, టి దయాకర్లు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న అటవీ భూములకు డి ఫామ్ పట్టాలు ఇవ్వాలి

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 04, మన సాక్షి :**

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమల గిరి సాగర్ మండలంలో పెండింగ్ లో ఉన్న ఫారెస్టు భూములకు త్వరితగతిన డి -ఫామ్ పట్టాలు ఇవ్వాలని నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి కోరారు. శనివారం నాగార్జునసాగర్ లోని విజయ విహార్ లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో తిరుమలగిరి సాగర్ మండలంలో పెండింగ్ భూముల సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడుతూ తిరుమలగిరి సాగర్ మండలంలో దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత 30 సంవత్సరాలుగా అటవీ భూములు సాగు చేసుకుంటున్న పేద రైతులకు డి- ఫామ్ పట్టాలు ఇవ్వాలని, అస్సైన్మెంట్ భూముల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ



ఫారెస్ట్ భూములకు డి-ఫామ్ పట్టాలిచ్చే ప్రక్రియ కొనసాగుతున్నదని, వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల పై ప్రస్తుతం ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేకంగా నాలుగు బృందాలు ఏర్పాటు చేశామని
,గ్రామ స్థాయిలో సర్వే నిర్వహించి, గ్రామ సభల ద్వారా ధృవీకరణ చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 12,000 ఎకరాల భూమి సర్వే పూర్తయిందన్నారు.
సర్వే నంబర్ల ఆధారంగా రికార్డులు సిద్ధం చేస్తున్నామని వివరించారు. రైతుబంధు వంటి పథకాలు దుర్వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తిరుమలగిరి సాగర్ తహసిల్దార్ అనిల్, ఆర్ ఐ లు దండా శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

**వెల్దండ,ఏప్రిల్ 04,మన సాక్షి:**

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకంతో ఎంతోమంది నిరుపేద ప్రజలకు మేలు జరుగుతుందని సర్పంచ్ మొక్కల రమేష్ ముదిరాజ్ అన్నారు. శనివారం వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన నరకట్ల దివ్యకు రూ. 60 వేలు, మెరుగు పూజకు రూ. 15 వేలు, జి లలితకు రూ. 25 వేల చొప్పున మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..!

**వెల్దండ,ఏప్రిల్ 04,మన సాక్షి:**

వెల్దండ మండల కేంద్రంలో నేడు 33/11 కే.వి వెల్దండ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహణ పనులు నిర్వహించబడనున్నందున క్రింది ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. 11 కే.వి వెల్దండ టౌన్,11 కే.వి రూరల్,11 కే.వి స్టోన్ క్రషర్,11 కే.వి కుప్పగండ్ల, 11 కే.వి చొక్కన్నపల్లి, సమయంఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకుప్రభావిత ప్రాంతాలు వెల్దండ టౌన్, కొట్రా ఎక్స్ రోడ్స్, కొట్రా తండా, కంటోనిపల్లి, చొక్కన్నపల్లి వ్యవసాయ సేవలు వినియోగదారులు శాఖకు సహకరించవలసిందిగా ఏఈ, ఓపి వెల్దండ విద్యుత్ శాఖ వారు తెలియజేశారు.

# జిల్లా జైలులో ఉచిత వైద్య శిబిరం

**నల్లగొండ,ఏప్రిల్ 04,మన సాక్షి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణలో భాగంగా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కారాగారంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నీలగిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో, జిల్లా కారాగారం పర్యవేక్షణ అధికారి కూన ఆనందరావు అధ్యక్షతన, కారాగార వైద్య అధికారి డాక్టర్ సట్టు కిరణ్ కుమార్ సారథ్యంలో వైద్య శిబిరాము నిర్వహించారు . ఈ శిబిరంలో ఖైదీలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్, ఆప్తల్మాలజిస్ట్ (కంటి వైద్యులు), మానసిక వైద్యులు,నిపుణులు, ఎముకల వైద్యులు (ఆర్థోపెడిక్ వైద్యులు), స్త్రీల వైద్య నిపుణులు (గైనకాలజిస్టులు)




ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి మందులను అవసరమైన వారికి అందజేశారు. ఈ వైద్య శిబిరంలో డా. సుబ్బా రావు (మానసిక వైద్యుడు), డా. వి. వినోద్ కుమార్ ( ఈ న్ టీ నిపుణుడు), డా. పుల్లారావు (కంటి వైద్యుడు), డా. రమేష్ (క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ ఫిజీషియన్), డా. శంకర్ (ఫిజీషియన్), డా. విశ్వజ్యోతి (స్త్రీల వైద్య నిపుణులు), డా. రామచంద్ర (ఆర్థోపెడిక్ వైద్యుడు), డా. జి. ప్రవీణ్ (జనరల్ సర్జన్), డా. భరద్వాజ్ (డెంటల్ సర్జన్), డా. వంశీ (డెంటల్ సర్జన్), డా. శ్రీవాస్తవ (ఫిజీషియన్ జిల్లా కారాగారం జైలర్ బాలకృష్ణ డిప్యూటీ జైలర్లు వెంకట్ రెడ్డి, సుబ్బరాజు, మెడికల్ సిబ్బంది సీతారామ్, లింగయ్య, అలాగే పోలీసు సిబ్బంది సైదులు, గిరిబాబు, సురేష్, రాంబాబు, కర్ణాకర్, శ్రావణ్, జయప్రకాష్ రెడ్డి, గణేశ్, శ్రీకాంత్ కోటి తదితరులు పాల్గొన్నారు.

# కల్లేడిలో విషాదం..నవవధువు ఆత్మహత్య..!





**ఆలూర్, ఏప్రిల్ 04, మన సాక్షి:**

నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం కల్లేడి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వివాహమై నెల రోజులు కూడా గడవకముందే ఓ నవవధువు బలవన్మరణానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఘటన వివరాల్లోకి వెళ్తే:బాన్సువాడకు చెందిన అఖిలకు,కల్లేడి గ్రామానికి చెందిన తలారి శ్రీకాంత్‌తో గత నెల మార్చి 5వ తేదీన పెద్దల సమక్షంలో ఘనంగా వివాహం జరిగింది. పెళ్లయిన పది రోజుల తర్వాత అఖిల తన పుట్టింటికి వెళ్లి, తిరిగి శుక్రవారమే అత్తగారి ఇంటికి (కల్లేడి) చేరుకుంది. శనివారం ఉదయం భర్త శ్రీకాంత్ టిఫిన్ తీసుకుని పని నిమిత్తం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేనిది చూసి అఖిల ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. కుటుంబ సభ్యులు గమనించే లోపే అఖిల మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి .సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అన్ని విషయాలు సాఫీగా సాగుతున్న క్రమంలో అఖిల ఈ కఠిన నిర్ణయం ఎందుకు తీసుకుందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# యువకుడి దారుణ హత్య..!

**వెల్దండఓఏప్రిల్ 04,మన సాక్షి:**



వెల్దండ మండల కేంద్రానికి చెందిన రుద్రాక్షల మహేష్ (28) అనే యువకుడిని దుండగులు శుక్రవారం రాత్రి దారుణంగా హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. మండల కేంద్రం నుంచి పోతే పెల్లికి వెళ్లే రహదారి గుండా తన పొలంలోని వ్యవసాయ పనుల నిమిత్తం తన కారులో బయలుదేరుతున్న యువకుడిని పెద్దదండ వైపు వస్తున్న టిప్పర్ తో క్రషర్ మిషన్ సమీపంలో ఢీకొట్టి , తీవ్ర గాయాలైన అతడిని బయటకు తీసి బండరాళ్లతో హత్య చేసినట్టు ప్రాథమిక విచారణలో పోలీసులు తెలిపారు. అయితే పాత కక్షల నేపథ్యంలో ఈ సంఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

# ఆమనగల్లుకు పూర్వ వైభవం తెస్తాం..!

**- పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి**

**ఆమనగల్లు, ఏప్రిల్ 04, మన సాక్షి:**



గత పది ఏళ్ల టిఆర్ఎస్ కాలంలో ఆమనగల్లు చిన్న బిన్నం చేశారని అభివృద్ధిలో పూర్తిగా వెనుక బడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆమనగల్లు కు పూర్వ వైభవం తెస్తామని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి తెలిపారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలో రూ నాలుగు కోట్లతో చేపట్టిన బీసీ హాస్టల్ భవన నిర్మాణ పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్య నాయక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు తో కలిసి ఎంపీ మల్లు రవి పరిశీలించారు. పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు కాంట్రాక్టు సూచించారు. విద్యా రంగంలో ఆమనగల్లును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి విద్య హబ్ గా మారుస్తామని తెలిపారు. అందులో భాగంగానే తలకొండ పల్లి మండలం ఖానాపూర్ గ్రామం వద్ద 25 ఎకరాలలో ప్రభుత్వం రెండు వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తుందని తెలిపారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భూ వివాద సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని భవనం పనులను పూర్తిచేసే విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీతో ఆమనగల్లు పూర్వపు సమితికి వరంలా మారుతుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా ఆమనగల్లు కు ఏసీబీ కార్యాలయం తీసుకురావడం జరిగిందని అతి త్వరలో అన్ని డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని మల్లు రవి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి ఆమనగల్లు పూర్వ వైభవం తెస్తామని మల్లు రవి ఈ సందర్భంగా,తెలిపారు.

# హిందూ ధర్మమే ప్రపంచానికి దిక్సూచి




**నారాయణపేట టౌన్,ఏప్రిల్ 04, మన సాక్షి :**

సృష్టిలో ఎన్ని యుగాలు మారినా ఎన్ని తరాలు మారినా హిందూ ధర్మం ప్రపంచానికి దిక్సూచిగా ఉంటుందని విశ్వహిందూ పరిషత్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కూర జయదేవ్ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రం లో జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయ న ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ నేడు ఏఐ టెక్నా లజీ ప్రపంచాన్ని నడిపిస్తు న్నప్పటికీ సృష్టికి మూలం హిందూ ధర్మమేనని పేర్కొన్నారు. వేద కాలం నుంచి ప్రపంచంలోని జీవ రాశికి హిందూ ధర్మమే మార్గ దర్శ మన్నారు. అందులో భాగంగానే భవిష్యత్తులో జరగబోయే కాలమానిని కూడా క్షణము, నిమిషము, దినము, వారము, నెల, సంవత్సరము, అన్నింటిని లెక్క కట్టి కాలమానిని రూపొందించే శక్తి ఒక్క ధర్మా చార్యులకు మాత్రమే ఉందని అన్నారు. శుభము ఆశుభ ము అన్నింటి వివరాలు చెప్ప గల సామర్థ్యం సనాతన హిందూ ధర్మానిదేనని అన్నారు. ధర్మచార్యుల మార్గద ర్శనంతోనే సృష్టి మనుగడ సాగిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ హౌస్ అరెస్టు..!

**చింతపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి:**



సీఐడీ కార్యాలయం ముట్టడి సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......సీఐడీ విచారణ పేరుతో వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు అని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయింది అని ఆయన అన్నారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చింది. ఇప్పుడు ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా చేతులెత్తేసింది అని ఆయన తెలిపారు. అభివృద్ధి మరిచి అరెస్టుల పేరుతో ప్రభుత్వం పబ్బం గడుపుతుంది అని ఆయన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మహిళల భద్రత మన అందరి బాధ్యత




**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 04 మన సాక్షి :**

మహిళలపై జరుగుతున్న ప్రతి హింసను అరికట్టడం, వారికి తక్షణ సహాయం అందించడం పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. గృహ హింస, వరకట్న వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, లైంగిక దాడులు, బాలికల అక్రమ రవాణా వంటి ఘటనలను అరికట్టేందుకు పోలీస్ శాఖతో పాటు మహిళా సంక్షేమ విభాగం సమన్వయంతో పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. శనివారం సఖి వన్ స్టాప్ సెంటర్ బృందం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. సఖి సెంటర్లో పోలీస్
సహాయం తక్షణం
అందించబడుతుందనీ,అత్యవసర వైద్య సేవలు కల్పించబడతాయని తెలిపారు. సఖి సెంటర్లో న్యాయ సహాయం (అడ్వకేట్ ద్వారా) కల్పించ బడుతుందన్నారు. 24 గంటలు అందుబాటులో ఉన్న సఖి కేంద్రాన్ని సంప్రదించేందుకు ఫోన్ నెంబర్: 08506-295181 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181 కు కాల్ చేయవచ్చని వారు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్ లైన్ -- 181 మరియు సఖి (వన్ స్టాప్ సెంటర్) సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ -- క్రాంతి రేఖ,కేస్ వర్కర్ చంద్రకళ,పారామెడికల్ లక్ష్మి పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

**పెన్ పహాడ్,ఏప్రిల్ 04,మన సాక్షి:**



తెలంగాణ ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మాచారం సర్పంచ్ ఇటుకల శ్రీను అన్నారు. శనివారం మాచారం గ్రామ పంచాయతీ పరిధిలో ఆవాస్ గ్రామం గుడిబండతండలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ కార్యక్రమంలో బుక్య బిక్షం ఇల్లు స్లాబ్ కార్యక్రమాన్ని ప్రత్యేక పూజలు జరిపి ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో మాచారం సర్పంచ్ ఇటికాల శ్రీను, వార్డు నెంబర్లు భూక్యమంగత, భూక్య బాలాజీ , కోకియ, శ్రీను ,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుంగతుర్తి క్రీడా స్టేడియంలో వడ్లు పోయొద్దు..!

**తుంగతుర్తి,ఏప్రిల్ 04, మన సాక్షి:**



తుంగతుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో ధాన్యం రాశులు ఐకెపి కేంద్రానికి వాడుకోవద్దని పట్టణానికి చెందిన పలువురు క్రీడ యువకులు శనివారం తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ మినీ స్టేడియంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో మార్నింగ్ వాకర్స్ ఈవినింగ్ వాకర్సులకు ఇబ్బందికరంగా ఉందని వారు తెలిపారు ప్రతిసారి మినీ స్టేడియంలో వడ్ల కొనుగోలు కేంద్రం నిర్వాహకులు వాడుకొని ఈ క్రీడా ప్రాంగణంలో హరితహారం మొక్కలు కూడా లేకుండా ఒకపక్క గోర్లు మేకలు పశువులు మేసి ఎలాంటి హరితహారం మొక్కలు కూడా కాపాడుకోలేక ఉన్న ఈ క్రీడా ప్రాంగణాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా చుట్టూ కూడా ఉన్నప్పటికీ గేటు ఉన్నప్పటికీ దీని సంరక్షణ మాత్రం ఎవరి చేతిలో ఉందో గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు క్రీడా ప్రాంగణం ఉన్న రూములు కూడా సరిగా సౌకర్యాలు లేక త్రాగునీరు లేక యువకులకు ఇబ్బంది కలుగుతుందని వారు మొరపెట్టుకుంటున్నారు. ఈ మినీ స్టేడియానికి ఒక క్రీడల మాస్టర్ను పెట్టి కొన్ని క్రీడలను యువతకు నేర్పాలని పలువురు కోరుతున్నారు.

# ఆర్మీ లెఫ్టినెంట్ గా చిలుముల సుధాకర్..!

**నల్లగొండ, మార్చి 04, మన సాక్షి:**

నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చిలుముల సుధాకర్ , నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్. సి. సి) లో అసోసియేట్ ఎన్.సి.సి ఆఫీసర్ (ఏఎన్ఓ)గా సేవలందించేందుకు అర్హత సాధించి,లెఫ్టినెంట్ హోదాతో ఆర్మీ ఆఫీసర్ ర్యాంకు పొందాడు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్న ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో జనవరి 5 నుండి ఏప్రిల్ 4 వరకు మూడు నెలల పాటు అత్యంత కఠినమైన సైనిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ ఆర్మీ శిక్షణలో భాగంగా ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, డ్రిల్, ఫిజికల్ ట్రైనింగ్, నాయకత్వ లక్షణాల అభివృద్ధి వంటి అంశాలలో సమగ్ర శిక్షణ పొందారు.అలాగే, ఎన్.సీ.సీ క్యాడెట్లను భారత సైన్యంలో చేరేందుకు



ప్రోత్సహించడం, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడం, సైనిక జీవన విధానం పట్ల అవగాహన కల్పించడం వంటి ముఖ్య అంశాలపై కూడా ప్రత్యేకంగా శిక్షణ పొందారు.శిక్షణ అనంతరం, చిలుముల సుధాకర్ లెఫ్టినెంట్ గా ఆర్మీ అధికారిగా నియామకంతో కళాశాలకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ అకాడమిక్ కోఆర్డినేటర్ బత్తిని నాగరాజు, అంతర్గత నాణ్యతా వైస్ప్రిన్సిపాల్స్ డా. పరంగి రవి కుమార్,ప్రొఫెసర్ అంతటి శ్రీనివాసులు, పరీక్షల నియంత్రణాధికారి డా. డి. మునిస్వామి, తెలుగు శాఖ అధ్యక్షులు డా. వెల్దండి శ్రీధర్ వివిధ విభాగాల అధ్యక్షులు డా. ఎ. మల్లేశం, డా. జ్యోత్స్న, శివరాణి, ఇతర అధ్యాపకులు సుధాకర్ ను హృదయపూర్వకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన విక్రమ్ రెడ్డి..!



**తుంగతుర్తి,ఏప్రిల్ 04, మన సాక్షి:**

నమ్మిన సిద్ధాంతానికి నైతిక విలువలకు ఆదర్శాలకు మార్గదర్శకంగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి కామ్రేడ్ దాయం విక్రమ్ రెడ్డి అని ఎమ్మెల్యే మందుల సామెల్, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం అన్నారు.మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామ్రేడ్ దాయం విక్రం రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు.గ్రామ ప్రజలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు ఘన నివాళు లర్పించారు.ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ...కామ్రేడ్ దాయం విక్రమ్ రెడ్డి రాజకీయ జీవితంలో దాదాపు 30 ఏళ్ల పాటు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కీలక పాత్ర పోషించారన్నారు.ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి బండ ప్రకాశ్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మల్లు కపోతం రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, వివిధ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గానుగుబండలో సత్యసాయి భజన

**గరిడేపల్లి,ఏప్రిల్ 04,మన సాక్షి :**

సత్య సాయిబాబా బోధించిన బోధనలను అనుసరించి, ప్రతి వ్యక్తి మోక్షాన్ని సాధించవచ్చునని సత్య సాయిబాబా మిర్యాలగూడ,,సాయి సేవా సమితి కన్వీనర్ సిహెచ్ ఆదినారాయణ అన్నారు. సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా నూరు గ్రామాలలో నూరు భజనలు చేయాలని సంకల్పించుకున్నామని అందులో భాగంగా గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామం లోని రామాలయం వద్ద 45 వ భజన కార్యక్రమం చేయటం జరిగిందని అన్నారు.ఈ భజన కార్యక్రమంలో మిర్యాలగూడ సత్య సాయిబాబా భజన బృందం తో పాటు గానుగబండ గ్రామ సత్యసాయి భక్తులు, సత్యసాయి కీర్తనలు ఆలాపన చేశారు.ఈ సందర్భంగా వారు,హాజరైన భక్తులు మాట్లాడుతూ సత్య సాయి బోధనలు అమోఘమైనవని,వారు ప్రజలందరూ ప్రేమతో ఉండాలని సేవా గుణం కలిగి ఉండాలని అన్నారు.అనంతరం పంగ శ్రావణి ఆధ్వర్యంలో చెక్క భజన వేసినారు. భజన కార్యక్రమంలో మిర్యాలగూడ



సాయి భక్తులు రఘు ,రేవతి , వేణు బాబు గానుగబండ గ్రామ సాయి భక్తులు, మాజీ ఎంపిటిసి పోకల వెంకమ్మ, గుర్రం, జయమ్మ, గోధుమల ఈశ్వరమ్మ, కట్ట ఝాన్సీ,షేక్ హిమాంబి,పంగా శ్రావణి,సత్యవతి, అనిత,జానపాటి సైదులు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వినర్ గా యాదయ్య..!

**నల్లగొండ,ఏప్రిల్ 04,మన సాక్షి:**

బాలల హక్కుల పరిరక్షణ వేదిక నల్లగొండ ఉమ్మడి జిల్లా నూతన కమిటీని ఉమ్మడి సమన్వయకర్త ఎర్ర శివరాజు రాష్ట్ర కో కన్వీనర్ పొదిల శ్రీనివాస్ సమక్షంలో జరిగిన ఒక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా నూతన కమిటి కన్వనర్ గ మాధగోని యాదయ్య, జిల్లా కార్యదర్శిగ జిల్లా శాంసన్, జిల్లా కో.కన్వనర్స్ గా మెరుగు పెద్దయ్య, కందుల మోహన్, విజయలక్ష్మి, జటవత్ రవి, గోపనబోయిన క్రిష్ణ, ఇర్గి నారాయణ, చింత స్వప్న, సహాయ కార్యదర్శి పొతేం కర్ణకర్, కోశాధికారి కొండ పూర్ణిమ, సలహాదారులుగా పగడాల నాగయ్య, కొండల్ రెడ్డి, కె జానయ్య,లను ఎన్నుకున్నారు ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కన్వీనర్, కార్యదర్శి మాట్లాడుతూ సమాన విద్యా, న్యాయం రావాలంటే తెలంగాణ విద్యా కమిషన్ ఇచ్చిన సిఫారసులను వచ్చే విద్యా సంవత్సరం నుండే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.



# అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

**చకచకా పనులు సాగి తీరాల్సిందే**

**అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం**

**అమరావతి చరిత్రలో అందరూ భాగస్వాములే**

**నిర్మాణ పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు**



అమరావతి: రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు. రగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టా÷-గ్గ÷ట్‌లు నిర్దేశిరచుకుని పనులు పూర్తి చేయాలని అధికారులు, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములవుతున్నట్టే అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు... కానీ రాజధాని నగరాన్ని



నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి.

# బిఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థిక సాయం

**వెల్దండ, ఏప్రిల్ 04,మన సాక్షి:**



వెల్దండ మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన షబానా బేగం అనారోగ్యంతో బాధపడుతు ఓవైసీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు.ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, కుప్పగండ్ల మాజీ సర్పంచ్ ముక్తాల శేఖర్ శనివారం వారిని పరామర్శించి ఆస్పత్రి ఖర్చులకు గాని తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 5వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధ్యత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు గ్రామ యువకులు పాల్గొన్నారు

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

**బావిలోకి దూసుకెళ్లిన కారు**

**ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి**



ముంబై:మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.